క్లుప్తంగా

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం


జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నేతలు

దెందులూరు: వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక భద్రత లభించిందని ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ అన్నారు. సోమవారం కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులత గంగాధర్ అధ్యక్షతన డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా వైఎస్సార్ ఆసరా నిధుల జమతో తమకెంతో ఊరట కలిగించిందని డ్వాక్రా మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లా వీరా స్వామి, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, నాయకులు, డ్వాక్రా మహిళలు ఉన్నారు.

కోడి వ్యర్థాల వాహనం స్వాధీనం

భీమడోలు: కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఓ వాహనాన్ని సోమవారం అంబర్‌పేట శివారు కురెళ్లగూడెం వద్ద భీమడోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు కలిగించే కోడి వ్యర్థాలను చేపల చెరువులకు ఓ వాహనంలో తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. కోడి వ్యర్థాలను తరలిస్తున్న ఉంగుటూరు మండలం రామన్నగూడెంకు చెందిన వనమాల రామకృష్ణ, సైదు నాగబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. గ్రామశివారులో వ్యర్థాలను వీఆర్వో సమక్షంలో పూడ్చినట్లు ఆయన తెలిపారు.

నాగన్నగూడెంలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

దెందులూరు: పెదవేగి మండలం నాగన్నగూడెంలో జ్యోతి రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేతని చర్చి ఆవరణలో పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు పాస్టర్ జ్యోతి రాజు తెలిపారు. డెంగీ, బీపీ, సుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, కీళ్లవాతలు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలందించామన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందించినట్టు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


ఏఆర్‌డీజీకే పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- పాఠశాలల్లో లైబ్రరీ గదుల ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మనం చదివే ప్రతి పుస్తకం జీవితంలో విజయానికి ఒక కొత్త మార్గాన్ని చూపుతుందని, విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు రూ.10 లక్షలతో కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో, రూ.24 లక్షలతో ఆదివారపుపేటలోని ఏఆర్‌డీజీకే నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్మించిన లైబ్రరీ గదులను ఆయన సోమవారం ప్రారంభించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను కలెక్టర్ ఆవిష్కరించారు. లైబ్రరీ నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే విధంగా జ్ఞానానిచ్చే అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులను జ్ఞానవంతులుగా చేసి సమాజానికి తోడ్పడే నైతిక బాధ్యత గల వ్యక్తులుగా చేయడంలో లైబ్రరీలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివి, తిరిగి వాటిని పాఠశాలలోని గ్రంథాలయంలో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయ నిర్వహణకు ఒక ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లైబ్రరీలపై కలెక్టర్ విద్యార్థినీ విద్యార్థుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలల్లో లైబ్రరీ గది ఏర్పాటు చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు దిన పత్రికలు, పుస్తకాలను చదివి మరింత విజ్ఞాన వంతులు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

పదో తరగతి విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్

ఆయా పాఠశాలల్లో లైబ్రరీ గదులను ప్రారంభించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. రానున్న పరీక్షల్లో విజయవంతులు కావాలని, వారికి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. పరీక్షలకు ఉన్న సమయాన్ని వృథా చేయకుండా విద్యపైనే దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు బాపిరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉజ్వల, జి.సునీత, పలువురు నగరపాలక సంస్థ ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: సామాజికంగా, ఆర్థికంగా మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మందలపర్రు గ్రామంలో టీటీడీ బోర్డు సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు స్థల ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత నగదు జమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ జగన్ తన ప్రజా సంకల్పయాత్రలో గత ప్రభుత్వం రుణమాఫీ హామీతో అధికారం చేపట్టి డ్వాక్రా గ్రూపులను ఎలా మోసం చేసిందో మహిళలు గగ్గోలు పెట్టేవారన్నారు. దీంతో నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేసి నాలుగు విడతల్లో బ్యాంకు రుణాలు ప్రభుత్వమే చెల్లించదన్నారు. నాలుగో విడతలో ఆసరా పథకంలో రాష్ట్రంలోని 78.94 లక్షల మంది మహిళలకు రూ.6,395 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న బ్యాంక్ రుణాలను నాలుగు విడతల్లో చెల్లింస్తామని హామీ ఇచ్చి అమలు చేసి మహిళలకు అండగా ఉన్నారన్నారు.

మహిళా పక్షపాతిగా పాలన

సీఎం జగన్ మహిళల పక్షపాతిగా పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. గర్భిణులకు, బాలింతలకు, ఆరేళ్లలోపు పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెనతోపాటు మధ్యవయస్సు మహిళలకు చేయుత ద్వారా ఏటా రూ.18,750 ఆర్థిక సాయం అందజేస్తున్నామని చెప్పారు. కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళకు కాపు నేస్తం ద్వారా రూ.15 వేలు, వైఎస్సార్ పింఛను కానుక కింద ప్రతి నెలా 1వ తేదీనే రూ.3 వేలు నగదును నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ విశ్వసనీయత చాటుకున్న సీఎంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని డ్వాక్రా మహిళలను ఆయన కోరారు. అనంతరం మండలంలోని 1001 గ్రూపులకు రూ.9.02 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. తొలుత డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, స్టేట్ యూత్ సెక్రటరీ సంకు నాగేషుబాబు, మండల కన్వీనర్ సంకు సత్య కుమార్, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, సచివాలయ మండల కన్వీనర్ నౌడు అచ్యుత రామారావు, సర్పంచ్‌లు దెందుకూరి బంగారమ్మ త్రిమూర్తిరాజు, పాట్నూరి ఉమా, దాసే ఝాన్సీ, వైస్ ఎంపీపీలు బండి రమణవిస్సాకు, సమయం రాఘవులు, ఎంపీటీసీ ముదునూరు త్రివేణి తదితరులున్నారు.

అటవీశాఖ కార్యాలయాన్ని పరిశీలించిన సీసీఎఫ్

పోలవరం రూరల్: పోలవరం అటవీశాఖ కార్యాలయాన్ని సీసీఎఫ్ వై.శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందితో అటవీ శాఖ పరిధిలో ఉన్న సమస్యలపై చర్చించారు. తొలుత ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంత పనులను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో ఎంతవరకు అటవీ ప్రాంతం ముంపునకు గురైంది? ఎంత వరకు కేటాయించారు అనే విషయాలను తెలుసుకున్నారు. ఆయన వెంట స్క్వాడ్ డీఎఫ్ఓ త్రిమూర్తుల రెడ్డి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	24
వంకాయలు (కాంతులు)	20	బీర్లచిక్కుడు	34
వంకాయలు (తెలుపు)	32	చామదుంపలు	60
బెండకాయలు	38	ములక్కాడలు	10-12
పచ్చిమిర్చి	34	కంద	60
కాకర కాయలు	48	బీట్‌రూట్	30
బీరకాయలు	44	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	25-30	అల్లం	120
క్యారెట్	28	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	08
దోసకాయలు	28-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్ఈఎల్	22.15	4822	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

అలరించిన త్యాగరాజ కీర్తనలు


త్యాగరాజ కీర్తనలు ఆలపించిన కళాకారిణిలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధానోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు సంగీత కళాకారులు ఆలపించిన త్యాగరాజ కీర్తనలు వీనుల విందు చేశాయి. నగరానికి చెందిన పార్వతి రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అబ్బుర పరిచాయి. కార్యక్రమాలు ఫైన్‌ఆర్ట్స్ అధ్యక్షురాలు పరిమి సావిత్రి, కార్యదర్శి దువ్వి హేమసుందర్, కోశాధికారి డీఏ కృష్ణకుమార్ పర్యవేక్షించారు. సంగీత కళాకారులు సూర్య పద్మకుమారి, వి.రామలక్ష్మి, డి.శైలజ, డీకే సమన్విత, కె.రాజేశ్వరి, వై.వాణి, ఎం వాణిశ్రీ, సరస్వతీ వీక్షణ గాత్ర కచేరి, వీణ, వయోలి, సంగీత వాద్య సమ్మేళనం నిర్వహించారు. వీరికి వీరా శివప్రసాద్ వయోలిన్, చల్లపల్లి లక్ష్మీ నారాయణ మృదంగ సహకారం అందించారు.

పీఎం యశస్వి స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధాన మంత్రి యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ విబ్రాంత్ ఇండియా (పీఎం యశస్వి) స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసేందుకు గడువు పొడిగించినట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో టాప్ క్లాస్ పాఠశాలల్లో 9, 10, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతున్న అర్హత గల ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఇచ్చే ఈ స్కాలర్‌షిప్ పొందడానికి విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదని తెలిపారు. ఇతర వివరాలకు హెచ్‌టీటీపీ://వైఈటీ.ఎన్‌టీఏ.ఏసీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వెల్లివిరిసిన క్రీడా స్ఫూర్తి

దెందులూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల ద్వారా క్రీడా స్ఫూర్తి వెల్లివిరిసిందని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. సోమవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో నియోజకవర్గ ఆడుదాం - ఆంధ్ర పోటీలు ముగింపు సభ, బహుమతుల పంపిణీ కార్యక్రమం ఎంపీడీఓ పీ.శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ 500 మంది క్రీడాకారులు దెందులూరు నియోజకవర్గం ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొని ఆటల స్ఫూర్తిని చాటుకున్నట్టు చెప్పారు. ఇందుకు పీఈటీలు, గ్రామ కార్యదర్శులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నత్తానియేలు భోజనం, గ్రౌండ్, వసతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కబడ్డీలో పురుషుల విభాగంలో పెదపాడు ప్రథమ స్థానం, మహిళల విభాగంలో కొవ్వలి సచివాలయం కబడ్డీ జట్టు ప్రథమ స్థానం సాధించింది. దుగ్గిరాల సచివాలయం జట్టు ఖోఖోలో విజయం సాధించింది. క్రికెట్‌లో మహిళా విభాగంలో కొవ్వలి సచివాలయం విజయం సాధించింది. గాలాయగూడెం సచివాలయం మహిళల జట్టు వాలీబాల్‌లో విజయం సాధించింది. పురుషుల విభాగంలో ఖోఖోలో కవ్వగుంట, షటిల్ బ్యాడ్మింటన్ అప్పన్నవీడు, వాలీబాల్ లక్ష్మీపురం జట్టు విజయం సాధించాయి. క్రికెట్‌లో పెదవేగి జట్టు విజయం సాధించింది. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన జట్లకు డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్, ఎంపీడీఓ పీ.శ్రీలత, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు, ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ కో ఆర్డినేటర్ రాజగోపాల్, మండల కోఆర్డినేటర్ జక్కుల సురేషులు ప్రశంసాపత్రాలు, షీల్డ్స్ అందజేశారు.

బాధితులను కాపాడిన వారికి ప్రోత్సాహకం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను కాపాడిన వారిని ప్రోత్సహిస్తూ రూ.5 వేల నగదు బహుమతి, ఆపద్బాంధవుడిగా గుర్తించి ప్రభుత్వం సేవా పత్రం అందిస్తుందని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఉప రవాణా కమిషనర్ ఎస్ శాంతకుమారి ఆధ్వర్యంలో రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఏటా జరిగే రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం 30 ఏళ్లలోపు వయసు వారే మరణిస్తున్నట్టు చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం తదితర కారణాల వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నట్టు తెలిపారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలని, విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.నాగమురళి మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ అజ్మీరా బద్దు, జి.స్వామి, రోడ్డు భద్రత వైద్యురాలు జి.మౌనిక, కళాశాల ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ, మానవత్వం కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గోవిందరాజులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జంతువుల పట్ల ప్రేమ, మానవత్వం కలిగి ఉండాలని ఏలూరు జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జి.నెహ్రూబాబు సూచించారు. సోమవారం జంతు సంక్షేమ పక్షోత్సవ సంబరాల్లో భాగంగా స్థానిక పశుసంవర్ధక శాఖ ఏలూరు డివిజన్, ఏలూరు ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద ఉన్న సెయింట్ మైఖేల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జంతు సంక్షేమ ప్రతినిధి మురళీకృష్ణ పాల్గొని జంతు ప్రేమ గురించి విద్యార్థులకు వివరించారు. పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు టి.గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థులు జంతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జంతువుల గురించిన వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జేసిస్టా, సిస్టర్ పద్మ, డాక్టర్లు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వారి త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛా జీవనం


విజయరాయి ఉన్నత పాఠశాలలో మాజీ సైనికులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పెదవేగి : ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా దేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నారని విజయరాయి సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి అన్నారు. పెదవేగి మండలం విజయరాయి ఉన్నత పాఠశాల్లో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయరాయికి చెందిన మాజీ సైనికుడు బొమ్మగాని వెంకటేశ్వరరావు, బోయపాటి పూర్ణచంద్రరావు, విజయరాయిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తెనాలి విశ్వం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మంతెన బాలకృష్ణ, హైస్కూల్‌తో సహా ఎన్నో భూదానాలు చేసిన విజయరాయి అయ్యగార్ల కుటుంబానికి చెందిన మాజీ సర్పంచ్ పీబీ శ్రీనివాస కృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ శివరామకృష్ణ మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకుని, విద్యార్థులు బాగా చదువుకొని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి, ఉప సర్పంచ్ లేగల శివరామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ న్యాయవాది బైగానీ రంగారావు, మాజీ సర్పంచ్ పీబీ శ్రీనివాసకృష్ణ, నాయకులు మంతెన కిషోర్, శ్రీనివాసరెడ్డి జగిలింకి కృష్ణ, సైదం సత్యనారాయణ, అప్పలనాయుడు, దుక్కిపాటి విజయ్ కుమార్, వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నరా రాంబాబు, స్కూలు హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా ఆటల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న వినయ్ ప్రసాద్, సర్పంచ్ విష్ణుతులసి

పెదపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని ఏలూరు నగర కార్పొరేటర్ రియాజ్ ఆలీఖాన్ చెప్పారు. పెదపాడు మండలం కలపర్రులో ఫిట్ ఇండియా పోటీలు ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు కబడ్డీ, యోగా, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిరాజ్ వెబ్ సొల్యూషన్స్ అధినేత రియాజ్ ఆలీఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రియాజ్ ఆలీఖాన్ చేతుల మీదుగా ఆటలు ప్రారంభించారు. రియాజ్ ఆలీఖాన్ పాఠశాలకు డొనేషన్ అందించడంతో ఆయన్ను సత్కరించి, అభినందించారు. శాయ్ అసిస్టెంట్ డైరెక్టరు వినయ్ ప్రసాద్ చేతుల మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, లాంగ్ జంప్ కోర్టులను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భీమయ్య, కంభం నాగరాజు, నాయకులు వత్రపు కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు


చోరీ చేసిన బైక్‌పై వెళుతున్న వ్యక్తి

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో పనిచేసే ఒక ఉద్యోగి బైక్ సోమవారం చోరీకి గురైంది. గ్రామానికి చెందిన దేవస్థానం రికార్డ్ అసిస్టెంట్ పాకనాటి వెంకటేష్ మధ్యాహ్నం తన బైక్‌ను ఉగాది మండపం వెనుక రోడ్డులోని తన ఇంటి ముందు పార్క్ చేశాడు. భోజనం చేసి బయటకొచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెదికినా ఫలితం దక్కలేదు. చివరకు గుడి సెంటర్‌లోని విలాస మండపం వద్ద ఉన్న దేవస్థానం సీసీ కెమేరా ఫుటేజ్‌ను పరిశీలించగా, గుర్తు తెలియని ఒక వ్యక్తి బైక్‌పై స్థానిక తూర్పు వీధిలో నుంచి గుడి సెంటర్ వైపునకు వెళ్లినట్టు రికార్డ్ అయ్యింది. దీంతో బైక్ చోరీకి గురైనట్టు నిర్ధారించుకున్న బాధితుడు వెంకటేష్ సీసీ ఫుటేజీలతో సహా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పెదపాడు: వ్యక్తి అనుమానాస్పద మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం అప్పనవీడులోని వేగిరెడ్డి థియేటర్ సమీపంలో గుడ్‌మాన్ పేట గుడివాడకు చెందిన కొర్ల జయకుమార్ (30) ఈనెల 28న ఉదయం 8 గంటలకు స్పృహ కోల్పోయి ఉండటంతో స్థానికుల ద్వారా బంధువులకు సమాచారం అందింది. వెంటనే జయకుమార్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 11.30 గంటల సమయంలో బాధితుడు మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

భీమడోలు: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పాతూరుకు చెందిన మామిడిపల్లి నాగభూషణం నియమితులయ్యారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య సుబ్బయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎం.నాగభూషణంను నియమిస్తూ సోమవారం పత్రాలు అందించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితిలో నాగభూషణంకు జిల్లా స్థాయి పదవి దక్కడంపై పలువురు అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం లబ్ధిదారులకు అందేలా తనవంతు కృషి చేస్తానని నాగభూషణం అన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల శ్రేణుల సమావేశం

గణపవరం: గణపవరం మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత సమావేశం ఈనెల 30న మంగళవారం ఉదయం 8.30 గంటలకు గణపవరం మండలం అర్ధవరం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ దండు రాము తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని, రానున్న ఎన్నికలలో పార్టీ పరంగా అనుసరించాల్సిన విధానాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై ఆయన దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు.

ముగ్గురిపై కేసు

పెదపాడు: మద్యం సేవించిన నలుగురు వ్యక్తులు గొడవ పడిన ఘటనలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వసంతవాడలో ఈనెల 28న తెప్పల శ్రీనివాస్, పేడా శ్రీనివాస్, సిరివరపు ఓంకార్ గొడవకు దిగి మద్యం బాటిల్‌తో కొట్టినట్టు బాధితుడు గొల్లపల్లి శ్యామ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. శ్యామ్ గాయపడటంతో దీనికి కారణమైన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.